# సత్రవు అరుగు

అంగర సూర్యారావు

రామగో—ఆసత్రవు అరుగుమీద కూర్చున్నాడు చూశారూ—అతనిని గురించే నే నిప్పుడు చెప్పబోయేది. ఒకప్పుడు అతడు సౌందర్యోపాసి, ఎప్పుడూ అందమైన వేషంతో చూడ్డానికి ముచ్చటగా వుండేవాడు. కానీ యిప్పు డతడు మారిపోయాడు. సంస్కారశూన్యమై జడలు కట్టడానికి సిద్ధంగావున్నతల: మాసిన గెడ్డం: చిక్కిన శరీరం: చిరిగినగుడ్డలు: యిప్పుడతనిరూపం. రెండేళ్ల క్రితం అతనిని చూసినవా రెవరూ యిప్పుడతనిని గుర్తించలేరు. అసలు అతనికీ నాకూ పరిచయం ఏమిటంటే మేమిద్దరం ఒకే వూళ్లో ఒకే బడిలో చదువుతూ ఒకే యింటిలో మూడేళ్లున్నాం. మేమిద్దరం చదువుకునే ఆ రోజుల్లో అతడు ప్రతి విషయంలోనూ ఉత్సాహంతో పాల్గొనేవాడు. అతని ముఖం యెప్పుడూ ఉత్సాహపూరితమై ఉండేది. అటువంటిది పాఠశాలను విడిచిన ఈ రెండేళ్ళలోనే అతనిలో యింతమార్పు రావడానికి కారణం యేమిటని ఎందరికో సందేహం కలగ వచ్చును—రెండుసంవత్సరాలంటే మీకు స్వల్ప కాలంగా కనిపిస్తున్నదేమో! కానీ ఈ రెండేళ్ళలో ప్రపంచం యెంతగా మారింది! దేశానికి స్వాతంత్ర్యం రావడం: ఉన్న ఉద్యోగులలో సగంమంది నిరుద్యోగులు కావడం: విద్యాలయాలనుండి మరి కొంతమంది నిరుద్యోగులువచ్చి వీరికి జతకూడడం: దేశంలో సగటు మనుష్యుల సంఖ్య పెరగడం: మా వూరి చీకటి బజారువర్తకుడికి మూడంతస్తుల మేడలేవడం: మతోద్ధారకులు చెలరేగడం: యింకా ఎన్నో...ఎన్నో మార్పులు ఈ రెండేళ్ళలోనూ జరగలేదా? అటువంటప్పుడు మావాడిలో యింత మార్పు వచ్చిందంటే మీరు ఆశ్చర్యపడవలసిన అవసరం ఎంతమాత్రంలేదు. అతడొక గృహస్థు కావడం, మరొక రెండు అమాయక జీవుల్ని యీ లోకంలోకి తీసుకురావడంకూడా ఈ రెండేళ్ళలోనే జరిగింది.

పెట్టిపుట్టినవాళ్లు జీవితంలో ఎన్నో సమస్యల్ని ఎదుర్కొంటూవుంటారు. కానీ మాబోటి నిర్భాగ్యులకు జీవితమే ఒక సమస్యగా మారి అడుగడుగునా ఎదుర్కొంటూ వుంటుంది. మేము ఒకచోట అంటూ లేము. ప్రతిచోటా వున్నాం. ఉదయం లేస్తాం. సాయంత్రంవరకూ కాళ్ళు అరిగేలా వూరంతా తిరుగుతాం. రాత్రికి నిస్పృహతో యిల్లుచేరతాం. యింటిలోలేని వస్తువుల జాబితా యిల్లాలు చెబుతూవుంటే యింటి పైకప్పుకేసి చూస్తుంటాం. మమ్మల్నిచూసి జాలిపడే ప్రాణి ఒకటీ ఉండదు. పైగా అందరికీ మేమంటే ఎంతో అలుసు. వూళ్లో ఏ అలజడి జరిగినా మామీదే ఆరోపిస్తూ వుంటారు. ముఖ్యంగా మేం పోలీసులకు చక్కగా ఉపయోగిస్తున్నాం. తీవ్రరాజకీయ వాదులను అణచమనిగాని, మత సంస్థల్ని నొక్కిపెట్టమనిగాని పోలీసులకు ప్రభుత్వమునుండి హుకుం వచ్చినట్లయితే వారు తిన్నగా మా యిళ్ళకు వస్తారు. యిల్లంతా వెదుకుతారు. అధికారరీత్యా కొన్ని, అనధికారరీత్యా కొన్ని వస్తువుల్ని సంగ్రహించుకుపోతూవుంటారు. ఒకసారి ఒకమిత్రుడి యిల్లు పోలీసులు సోదాచేశారు. అతడికివున్న చరాస్తి ఆల్లా ఫౌంటెన్ పెన్ను ఒకటే! అది కాస్తా పోలీసులు కట్టుకుపోయారు. అతనికి కళ్ళనీళ్ళ పర్యంతం వచ్చింది. ఆవేశాన్ని పట్టలేక "స్వతంత్ర భారతంలో పోలీసులు" అనే శీర్షికతో ఒక వ్యాసాన్ని రాసి మూడు పత్రికలకు పంపాడు. (ఏ పత్రికా వేసుకోలేదులెండి!)—ప్రసంగాంతరానికి వచ్చినట్లున్నాం.

అతడు నాకెప్పుడూ ఆ సత్రవు అరుగు మీదనే కనిపిస్తూ వుంటాడు. అతని ముఖం దైన్యంతో ముడతలుపడి వృద్ధాప్యాన్ని జ్ఞప్తికితెస్తుంది. అతడు యిరవైరెండేళ్ళ యువకుడంటే మీరు నమ్మరేమో! వూరంతా తిరుగుతాడు. తరువాతవచ్చి సత్రవు అరుగుమీద కూర్చుని దారినిపోయే బళ్ళను, కార్లను, జనసమూహాన్ని చూస్తూవుంటాడు. ఎందుకు యిక్కడ కూర్చుంటావని అడిగాను ఒకసారి. యింటిదగ్గర నాకు మనస్థిమితం వుండదన్నాడు. అతడు, అతని

తండ్రీ భిన్నమానసిక ప్రవృత్తులు గల మనుషులు. తండ్రిదృష్టిలో అతడు యెందుకూ కొఱగాని వాడు: పట్టి అజ్ఞాని. ఆయనెప్పుడూ అతనిని సాధిస్తూ వుండేవాడు. యిల్లంతా గుల్లచేసి నీ చదువుకు తగలేశావనేవాడు. నీఅంతటి చేతగాని వాడు లోకంలో ఎవడూ వుండడనేవాడు. తండ్రి దూషణల్ని మౌనంగా భరించి సత్రవు అరుగుమీదికి వచ్చి శూన్యదృక్కులతో జనసమూహాన్ని చూస్తూ కూర్చుంటాడు. పాఠశాలను విడిచిన కొద్దినెలల వరకూ మాత్రమే అతనిముఖంలో ఉత్సాహం నిలిచింది. ఆరోజుల్లో ఉద్యోగప్రయత్నాలెన్నో చేశాడు. ఇంటర్వ్యూలకు వెళ్ళాడు. పర్యవసానంగా మరికొంత అప్పు పెరిగింది. ఆ రోజుల్లోనే ఎన్నో ఉద్గ్రంథాలు చదివాడు మరికొంత విజ్ఞానాన్ని ఆర్జించుకున్నాడు. కానీ తండ్రి దృష్టిలో మరింత అజ్ఞాని అయ్యాడు. పుస్తకాలంటే అతడికి ఎంత ప్రేమో ఆయనకు అంత ద్వేషం- తనకొడుకు అజ్ఞానాన్ని వృద్ధిచేస్తున్న ఆపుస్తకాలను చూసి ఆయన సహించలేక పోయాడు. చివరకు వాటినన్నిటిని చింపిపారేసి తృప్తిపొందాడు. ఈ ఘటన అతనిని మరింత క్రుంగదీసింది. సత్రవు అరుగుచేరాడు.

ఒకనాడు వూరంతా తిరిగి సత్రవుఅరుగు దగ్గరకు వచ్చాను. అతను ఎప్పటిలాగే కూర్చుని వున్నాడు. కానీ, అతనిముఖం రోజూ కంటే ఎన్నోరెట్లు వాడివుంది. "ఇవేళ యింత దిగులుగా వున్నావేం?" అన్నాను. అతడు ఒకసారి నావైపుచూశాడు. ఆచూపులో ఎంతో వైరాగ్యం కనిపిస్తోంది. 'వారంరోజుల నుండి చంటాడికి జబ్బుగావుంది. మందు తెమ్మంటుంది. ఎక్కడి నుంచి తేగలను? నేను యింటిదగ్గర బయలుదేరే సరికే వాడికి వొచ్చేప్రాణం పోయేప్రాణంగా వుంది.' ఒక దీర్ఘమైన నిట్టూర్పు విడిచి 'ఈపాటికి వాడు గమ్యస్థానం చేరుకోవచ్చు!' అని గొణుగుతున్నాడు. నాకళ్లు అశ్రుపూరితాలైనవి. కానీ నేను అతనికేం సహాయం చెయ్యగలను? నేనూ అతడి వంటి నిర్భాగ్యుడనే. యిక అక్కడ నిలబడలేక పోయాను. జనసందోహంలో కలిసిపోయాను.

వారంరోజులు కాలచక్రంలో దొర్లిపోయింది. ఆ సాయంకాలం వూరువిడిచి బయటకుపోయాను. పొలాలలో కొందరు కుప్పలు నూరుస్తున్నారు. కొందరు నూర్చిన ధాన్యాన్ని రెండెడ్ల బళ్ళపై పాటలుపాడుతూ యిళ్ళకు తోలుకెడుతున్నారు. సంధ్యాకాంతులు కుప్పలునూరుస్తున్న ఎడ్లపైని మనుషులపైనిపడి వారికి కొత్త తేజాన్నిస్తున్నవి. చిలుకలు, పిచ్చుకలు కలకలారవంచేస్తూ వడ్లను యేరుకు తింటున్నాయి. వాటిది ఎంతఆనందపూరితమైన జీవితం! వాటికి జీవితావసరవస్తువుల కెప్పుడైనా కొరతవస్తుందా? అయితే సృష్టిలోకల్లా విజ్ఞానసంపన్నుడైన మానవుడికేనా ఆదౌర్భాగ్యం? చీకట్లు నెమ్మదిగా వ్యాపిస్తున్నవి. వెనక్కి తిరిగాను. సత్రవు చేరుకోనేసరికి వాడిస్థానంలో మరో కొత్తమనిషి కనిపించాడు. సమీపించాను. ఎవరో కాదు! అతని తండ్రే! నన్నుచూడగానే ఆత్రుతగా ఆయన నన్ను సమీపించాడు. 'అబ్బాయి! మావాడు నీకెక్కడైనా కనిపించాడా? వారం రోజులనుండి వాడి జాడలేదు. ఎక్కడికి పోయాడో తెలియదు. చంటాడు కాస్తా వాడి ఋణం తీర్చుకు చక్కా పోయినాడు. పెద్దకుర్రాడు కన్ను తెరపడంలేదు. తండ్రికోసం బెంగపెట్టుకున్నట్లు కనిపిస్తాడు. వాడెక్కడకు పోయాడో నీకేమైనా తెలుసునా నాయనా!'- ఈవార్త కరడుగట్టిన నా హృదయాన్ని చలింపచేసింది. 'బహుశా సన్యసించి వుంటాడు!' అప్రయత్నంగా నా నోటినుండి యీ మాటలు వెలువడ్డాయి. ఆయన నావైపు తీక్షణంగా ఒకసారి చూసి వెళ్ళిపోయాడు. నేను ముందుకు సాగాను.

'దేశసౌభాగ్యం యువకులపైనే ఆధారపడి వుంది. యువకులు ప్రభుత్వముపట్ల భక్తి విశ్వాసాలతో ప్రవర్తించాలి' అని-విశ్వవిద్యాలయంలో మాట్లాడుతూ గవర్నర్ జనరల్ విద్యార్థుల్ని హెచ్చరించారు.మీ రీవార్తలు ఆలిండియా రేడియో నుండి వింటున్నారు.'

రేడియోలు, హోటళ్లు, సినీమాలు అన్నీ దాటి అనంతమైన దారిలో నడిచి యింకా వెడుతున్నాను. ఎక్కడికో—